# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, మంగళవారం 23 జనవరి 2024 | HYDERABAD




యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు



రవీంద్రభారతిలో సోమవారం సి. సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్, రసమయి సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి జానకీబాలకు సుశీల నారాయణ రెడ్డి ట్రస్టు పురస్కారాన్ని అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు -సుల్తాన్‌బజార్, జనవరి 22

## శిశువిహార్ పిల్లలకు సర్టిఫికెట్ కేంద్రాలు

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని శిశు సంరక్షణ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు అవసరమైన కుల, జన, ఆధార్, సదరం, అర్ఫన్ వంటి సర్టిఫికెట్లు జారీ చేయడానికి జిల్లా వ్యాప్తంగా ఎనిమిది ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నిర్ణయించారు. సోమవారం యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో సర్టిఫికెట్ల జారీకి ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ ప్రత్యేక కేంద్రాలు ఈ నెల 27 నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ సికింద్రాబాద్ ఆర్డీవో రవికుమార్, జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర రావు, జిల్లా వెనకబడిన తరగతుల జిల్లా అధాకారి ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి తదితరులు

## ప్రజావాణి ఫిర్యాదులు వారంలోగా పరిష్కరించాలి

### మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను వారం రోజుల్లో పరిష్కరించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించారు. 86 దరఖాస్తులను స్వీకరించగా, 62 విన్నపాలు హౌసింగ్‌కు సంబంధించినవి ఉన్నాయని మేయర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించి నివేదికను ప్రతి శనివారం అందజేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీకి రశీదు స్వీకరించిన ప్రతి దరఖాస్తును వారం రోజుల్లోనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జిదారుడికి ఎన్ని రోజుల్లో పరిష్కరించబడుతుందని లిఖిత పూర్వకంగా అధికారులు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ జియావుద్దీన్, అదనపు కమిషనర్లు ఉపేందర్‌రెడ్డి, యాదగిరి రావు, జయరాజ్ కెనడి, సరోజ, ప్రేమ్ చందర్‌రెడ్డి, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్, సీఈ దేవానంద్, కిషన్, హౌజింగ్ ఓఎస్డీ సురేష్ కుమార్, చీఫ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు, ఎస్‌డబ్ల్యూఎం ఎస్ఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వంద కోట్లు ఉన్నా.. డబుల్ ట్రబుల్

### మౌలిక వసతుల కల్పన కేసీఆర్ ప్రభుత్వం కేటాయింపు

### నిధుల విడుదలలో జాప్యం చేస్తున్న కమిషనర్



సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ ) : డబ్బుల్లేకుండా పనులు నిలిచిన సంఘటనలు ఇప్పటిదాకా చూశాం.. కానీ డబ్బులు ఉన్నా పనులను అటకెక్కించడం ఘనత వహించిన జీహెచ్ఎంసీకే చెల్లింది. తమ కలల ఇంటి సౌధమైన డబుల్ బెడ్ రూం ఇండ్లు దక్కించుకొని.. ఆ ఇంటిలో ప్రశాంత జీవనం గడుపుదామని అనుకున్న లబ్ధిదారులకు కమిషనర్ రొనాల్డ్ రాస్ వ్యవహార శైలి శాపంగా మారుతోంది. డబుల్ బెడ్ రూం పట్టాలు ఇచ్చారు సరే .. అందులో ఉందామంటే కనీసం కరెంట్ కనెక్షన్, నిర్వహణ సరిగా లేదంటూ సోమవారం ప్రజావాణి వేదికగా లబ్ధిదారులు గగ్గోలు పెట్టారు. నిరుపేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న బలమైన సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం 111 లోకేషన్లలో డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే ఉన్న చోటనే 27 ప్రాంతాల్లో (ఇన్‌సైట్)లో 5,363 మందికి, 39 లోకేషన్లలో 63, 478 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇండ్లను అందజేసింది. లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో భాగంగా 66 లోకేషన్లలో మొత్తం 68,841 మందికి పట్టాలు అందజేశారు. అయితే కార్పొరేట్ స్థాయిలో ఈ ప్రాజెక్టులో మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. కొన్ని చోట్ల కరెంట్ కనెక్షన్, కేబుల్ నెట్‌వర్క్, ఇంటర్‌నెట్, ఇతర మెయింటనెన్స్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మౌలిక వసతుల కల్పనలోనూ రాజీ పడకుండా కేసీఆర్ సర్కారు హెచ్ఎండీఏ నుంచి రూ. 100 కోట్లను జీహెచ్ఎంసీకి బదలాయించింది. నిబంధనల ప్రకారమే జీహెచ్ఎంసీ ఖజానాలోకి రూ.100 కోట్లు వచ్చి చేరాయి. కానీ నేటికీ ఈ నిధులు ఖజానా నుంచి నిర్వహణకు మళ్లలేదు. సంబంధిత అధికారులు నిధులు ఉన్నాయని, నిర్వహణ పనులు చేపట్టాలని గడిచిన రెండు నెలలుగా కమిషనర్‌కు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పెట్టారు. కానీ కమిషనర్ మాత్రం ఎటూ తేల్చకుండా 'డిస్కస్' అంటూ కాలయాపన చేస్తుండడంపై సంబంధిత శాఖ అధికారులు చేసేదేమీ లేక తలలు పట్టుకుంటున్నట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. రోజుల తరబడి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా తన వద్దనే ఫైల్ అంటిపెట్టుకున్న కమిషనర్ తీరుపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు మండిపడుతున్నారు.

## కరెంట్ కోతలపై మౌనమేలనోయి

### ఫిర్యాదులపై సోషల్ మీడియాలో నో రిప్లై

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా... ఇదీ కేసీఆర్ ప్రభుత్వ నినాదం. దానికి అనుగుణంగానే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ సరఫరాను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ విజయవంతంగా చేసింది. తాజాగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అనధికార విద్యుత్ కోతలు, అంతరాయాలు ఎక్కువయ్యాయి. దీంతో నగరవాసులు ఇదే విషయమై ట్విట్టర్ వేదికగా ఫిర్యాదులు చేస్తే వెంటనే @TsspdclCorporat పేరుతో ఉండే అకౌంట్‌లో ప్రతిస్పందించి 10-20 నిమిషాల్లో సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని పోస్టు చేశారు. అయితే కొన్ని రోజులుగా గ్రేటర్ పరిధిలో వేసవి మరమ్మతుల పేరిట విద్యుత్ సరఫరాను 30 నిమిషాల నుంచి 2 గంటల పాటు నిలిపివేస్తున్నారు. ఒకవైపు తరచూ వచ్చే ఫిర్యాదులకు తోడు మరమ్మతుల మూలంగా సోషల్ మీడియాలో విద్యుత్ సరఫరాపై ఫిర్యాదులు రావడంతో వాటికి సమాధానం ఇచ్చేందుకు విద్యుత్ శాఖ మౌనం పాటిస్తోంది. ప్రస్తుతం విద్యుత్ వినియోగదారులు చేసే పోస్టులు తప్ప, టీఎస్ఎస్‌పీడీసీఎల్ నుంచి తిరిగి పోస్టులు రావడం లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. గత డిసెంబర్‌లో ప్రతి రోజు 20 నుంచి 27 వరకు సందేశాలను టీఎస్ఎస్‌పీడీసీఎల్ సంస్థ పోస్టు చేసేది. ప్రస్తుతం ఒక్క పోస్టును కూడా ట్విట్టర్‌లో పెట్టడం లేదు. ఇటీవల ట్విట్టర్ వేదికగా టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ విద్యుత్ సరఫరాలో అంతరాయం చేసిన ట్వీట్ వైరల్‌గా మారి, ప్రతి రోజు 2 గంటలు విద్యుత్ కోతలు అన్నట్లుగా ప్రచారం కావడంతో ట్విట్టర్‌లో పోస్టు చేయడం లేదని తెలిసింది.

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF T.G. LTD. Lighting up your lives



## గాంధీ వర్ధంతికి ఏర్పాట్లు

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 30న మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్ వద్ద ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గాంధీ వర్ధంతి ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారితోపాటు ఇతర అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మునికి నివాళులర్పించేందుకు గవర్నర్, ముఖ్యమంత్రితో పాటు పలువురు ప్రముఖులు వస్తారని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సూర్యప్రకాశ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఫుడ్ సేఫ్టీపై శిక్షణ

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఆదేశాల మేరకు నేషనల్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంలో సోమవారం బేగంపేటలోని శ్రీశక్తి కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఫుడ్ హ్యాండ్లర్లకు శిక్షణను ఏర్పాటు చేశారు. నాణ్యమైన ఆహారం, ఫుడ్ హ్యాండ్లర్లకు పరిశుభ్రత, ఆహార చట్టాలు, కల్తీ నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



## జిల్లా అభివృద్ధిపై రేపు సమీక్ష

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : జిల్లా అభివృద్ధితో పాటు ఇతర అంశాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ నెల 24న కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నారు. అందుకు సంబంధించి సోమవారం సంబంధిత జిల్లా అధికారులు అన్ని ఫైళ్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వారిని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో ముందస్తు సమీక్ష సమావేశం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకటాచారి, ఆర్డీవో సూర్య ప్రకాశ్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



శంషాబాద్‌లోని ముచ్చింతల్ లో స్వర్ణభారతి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో హారతి తీసుకుంటున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు



కాచిగూడలో భక్తులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఐమాక్స్ సర్కిల్ లో నిర్వహించిన శ్రీరాముని ఉత్సవాలలో పాల్గొన్న ఎంపీ లక్ష్మణ్

## అయోధ్యలో ప్రతిష్ఠ సంబురం

## నగరం నుంచే వీక్షణం

హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఎంపీ లక్ష్మణ్‌లు అయోధ్యలో జరిగిన శ్రీరాముడి ప్రతిష్ఠకు సోమవారం వెళ్లలేకపోయారు. వారు నగరంలోనే పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతిష్ఠ వేడుకను టీవీల ద్వారా వీక్షించారు.



అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం ఐమాక్స్ సర్కిల్ లో నిర్వహించిన శ్రీరాముని ఊరేగింపు


## మూసీ కోసం.. 3 పర్యటనలు

### 20 రోజుల వ్యవధిలోనే..

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : మూసీ పరివాహక ప్రాంతం సుందరీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, హెచ్ఎండీఏ కమిషనర్ దానకిశోర్, హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ ఆమ్రపాలి, సీఎంవో అధికారులు దేశ, విదేశాల్లోని నదీ తీర ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను స్వయంగా పరిశీలించి, అధ్యయనం చేశారు. జనవరి 2న మూసీ సుందరీకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే 3 నెలల్లోగా మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో సమావేశం జరిగిన రెండు రోజుల్లో హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్, మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎంఆర్‌డీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి అహ్మదాబాద్ పర్యటనకు వెళ్లింది. ఆ నగరంలో సబర్మతి నదీతీర ప్రాంతాన్ని అధ్యయనం చేశారు. ఆ తర్వాత ఈ నెల 13న ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఆమ్రపాలి లండన్ పర్యటనకు వెళ్లారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనను ముగించుకొని తన బృందంతో పాటు లండన్ వెళ్లి అక్కడి థేమ్స్ నదీ తీరంలో చేపట్టిన అభివృద్ధిపై అధ్యయనం చేశారు. ఆ తర్వాత వెంటనే దుబాయ్ పర్యటనకు వెళ్లారు. ఇలా 20 రోజులలో మూడు కీలకమైన నదితీర ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులను సీఎంతో పాటు ఉన్నతాధికారుల బృందం అధ్యయనం చేసి వచ్చింది.



**అభిమానమే పూల వర్షమై..** స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్న ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డిని వీడ్కోలులో భాగంగా సోమవారం గుర్రపు బగ్గీపై ఊరేగిస్తూ పూల వర్షం కురిపిస్తున్న వైద్య విద్యార్థులు - సుల్తాన్‌బజార్, జనవరి 22



మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎగిసిపడుతున్న మంటలు

## మాదాపూర్ పీఎస్‌లో మంటలు

మాదాపూర్, జనవరి 22 : తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న సిలిండర్లు మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పేలడం తీవ్ర కలకలం సృష్టించింది. మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపిన వివరాల ప్రకారం... స్ట్రీట్ వెండర్స్ వద్ద తనిఖీల్లో సీజ్ చేసిన నాలుగు సిలిండర్లను పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో ఉంచారు. అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మాదాపూర్‌లో పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం భక్తులు పటాకులు కాల్చారు. ఇందులో నుంచి చిన్న నిప్పురవ్వ ఎగిరి పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఓ సిలిండర్‌పై పడి పేలింది. దీంతో మిగిలిన మూడు సిలిండర్లూ పేలాయి. పోలీస్‌స్టేషన్‌లో మంటలు చెలరేగడంతో పోలీస్ సిబ్బంది ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. హుటాహుటీన ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేసుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాగా పోలీస్ స్టేషన్ సమీపంలో పటాకులు కాల్చిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని డీసీపీ వినీత్ తెలిపారు.